## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**98490 98674**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు 28న

**అగనంపూడి :** పెందుర్తి నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల ఎంపికలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం 27వ తేదీన నిర్వహించాల్సి ఉండగా, వర్షాల కారణంగా ఒక రోజు వాయిదా వేసినట్టు ఆమె తెలిపారు. ఆయా మండలాల కోఆర్డినేటర్లు గమనించాలని ఆమె కోరారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా పోటీలు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, షటిల్ బాడ్మింటన్ పోటీలు, ఎంపికలు పరవాడలోని ఇండోర్ స్టేడియంలో అదే రోజు నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎంట్రీ ఫారాలతో హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దివ్య కళా మేళాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ అరుణోదయ స్పెషల్ స్కూల్ విద్యార్థులు

**మహారాణిపేట:** ఆంధ్రా యూనివర్సిటీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న దివ్య కళా మేళాలో భాగంగా గురువారం స్టీల్‌ప్లాంట్ అరుణోదయ స్పెషల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహూతులను అలరించింది. అరుణోదయ స్కూల్ తరఫున సాంస్కృతిక కమిటీ సభ్యులుగా ఎం.ఇందుమతి, డి.శ్రావణి, కె.వి.పద్మ, సుబేదా బేగం వ్యవహరించారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన అరుణదోయ స్కూల్ యాజమాన్యానికి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

### స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

**అల్లిపురం:** విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలని విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పిలుపునిచ్చారు. గురువారం కళాశాల సమావేశ మందిరంలో ఇగ్నో రీజినల్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో 'శానిటేషన్ అండ్ పర్సనల్ హైజీన్'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కేజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఆచార్యులు సీహెచ్ శిరీష పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇగ్నో రీజినల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారావు, కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, వెంకటరమణ, వెంకటపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మహారాణిపేట:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం సిరిపురంలో గల లోటస్ ఆస్పత్రి–1, 2 యూనిట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. 5 శాతం ఉచిత స్కానింగ్ చేస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని తెలిపే సైన్ బోర్డు ప్రదర్శించాలని సూచించారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఇప్పట్లో జరిగేనా?

- ముగిసిన స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘం గడువు
- ఎన్నికల ప్రక్రియలో జాప్యం



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఇప్పట్లో జరిగేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘంపై అసంతృప్తితో ఉన్న కార్మికులు సత్వరం ఎన్నికలు జరిపించాలని కోరుకుంటున్నా, సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్నికలు జరిపించకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు 2022 ఏప్రిల్ 23న జరిగాయి. గెలిచిన ఏఐటీయూసీ కూటమి ఆ ఏడాది జూన్ 9న అధికారిక గుర్తింపు పత్రం అందుకుంది. ఈ ఏడాది జూన్ 9వ తేదీతో వారి గుర్తింపు గడువు పూర్తయింది. దీంతో నూతన గుర్తింపు సంఘం కోసం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అనేక హామీలు ఇచ్చి గెలిచిన ప్రస్తుత గుర్తింపు యూనియన్ హయాంలో వేతన సవరణ జరగకపోవడం, ఒక్కో సదుపాయం కోల్పోతుండటంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న కార్మికులు ఎన్నికల కోసం యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రతిపక్ష కార్మిక సంఘాలు కూడా ఈ పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలవాలని యోచిస్తున్నాయి. ఈ క్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు న్యూఢిల్లీలోని కేంద్ర కార్మిక శాఖ (సీఎల్‌సీ) ఉన్నతాధికారులను కలిసి ఎన్నికల నిర్వహించాలని కోరారు.

**సంస్థలో ఆర్థిక సంక్షోభం**

స్టీల్‌ప్లాంట్ గత ఆరు నెలలుగా నెలలుగా ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఇప్పుడిప్పుడే ఉత్పత్తి పెంపుదిశగా ప్రయాణిస్తోంది. ఈ ఏడాది వార్షిక లక్ష్యాలకు చాలా దూరంగా ఉండటంతో అక్టోబర్ రెండో వారంలో రెండు ఫర్నేస్‌లు ప్రారంభించనున్నామని యాజమాన్యం ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో యాజమాన్యం మార్చి వరకు ఉత్పత్తిపై దృష్టి సారించే అవకాశం ఉంది. పైగా, ప్రస్తుతం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు కనీసం రూ. 40 లక్షలు ఖర్చు అవుతుందని యాజమాన్యం వర్గాల సమాచారం. ఇప్పటి ఆర్థిక పరిస్థితుల్లో యాజమాన్యం ఎన్నికల కోసం అంత వ్యయం చేసే పరిస్థితిలో లేదు.

ఐఎన్‌టీయూసీ నాయకుల విజ్ఞప్తి మేరకు సీఎల్‌సీ హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్)కు ఆదేశాలు జారీ చేయడంతో, డీసీఎల్ స్టీల్‌ప్లాంట్‌లోని 25 కార్మిక సంఘాలకు లేఖలు రాశారు. ఆయా సంఘాలకు చెందిన రిజిస్ట్రేషన్, రెన్యువల్, తదితర డాక్యుమెంట్లు అందజేయాలని లేఖల్లో పేర్కొన్నారు. సెప్టెంబర్ 12 లోగా వాటిని అందజేయాలని కోరినా.. ఇప్పటి వరకు నాలుగు కార్మిక సంఘాలు మాత్రమే డాక్యుమెంట్లు అందజేశాయి. మిగిలిన వారికి మరో నెల రోజులు గడువు పెంచనున్నట్టు హెచ్‌ఆర్ అధికారుల సమాచారం. వారి నుంచి వచ్చిన జవాబు ఆధారంగా ఆయా డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ శాఖకు వెరిఫికేషన్‌కు పంపనున్నారు. ఆ నివేదికను డీసీఎల్ కేంద్ర కార్మిక శాఖకు పంపిస్తారు. కేంద్ర కార్మికశాఖ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని నియమిస్తూ డీసీఎల్‌కు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించనుంది. ఆయన స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారు. ఎన్నికలు వేగంగా నిర్వహించడం ఇష్టం లేని యాజమాన్యం ఈ ప్రక్రియను నెమ్మదిగా చేపట్టడం ద్వారా డిసెంబర్, జనవరి నాటికి ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉత్పత్తి లక్ష్యాల దృష్ట్యా వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం వరకు ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

### ఎన్నికలు వెంటనే జరిపించాలి



ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీ వల్ల కార్మికులకు రెండేళ్లుగా తీవ్రంగా అన్యాయం జరుగుతోంది. వేతన సవరణ చేయకపోగా అనేక ఆర్థిక సదుపాయాలను పోగొట్టారు. వెంటనే ఎన్నికలు నిర్వహించడం ద్వారా కార్మికులకు పోగొట్టిన సదుపాయాలు పునరుద్ధరించేందుకు కృషి చేస్తాం.

– నీరుకొండ రామచంద్రరావు, అధ్యక్షుడు, స్టీల్ ఐఎన్‌టీయూసీ

### కొంత కాలం ఆగితే మంచిది..



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ముడిసరుకు కొరత వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఇప్పుడు మంత్రిత్వశాఖ నుంచి ముడిసరకు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉత్పత్తిపై ఎన్నికల ప్రభావం పడకుండా ఉండడం కోసం కొంతకాలం ఆగితే మంచిది.

– యు.రామస్వామి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ సీఐటీయూ

## విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి నెడుతున్న కేంద్రం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**అగనంపూడి :** కేంద్ర ప్రభుత్వం లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి తోసి ఉద్దేశపూర్వకంగా తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1323వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును దెబ్బతీయం, తద్వారా వారికి అనుకూలంగా ఉన్న బడాబాబులకు అప్పగించడం కోసం కేంద్ర పెద్దలు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ ఆటలో ఉక్కు ఉన్నతాధికారులు పావులుగా మారారన్నారు. అష్టదిగ్బంధనం చేసి విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి నెట్టేసి కోలుకోలేని దెబ్బ తీయడం కోసం కేంద్ర పెద్దలు కుట్రలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఈ అన్యాయాన్ని అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలుగజేసుకుని రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరక్కుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఎంఎస్, డీవైఎఫ్ఐ, టీయూ, వీఎస్‌యూ, యూజ్, వీఎస్‌పీఈయూ, వీఎస్ఎంఎస్ కార్మిక సంఘాల నాయకులు డేవిడ్, సుధీర్‌రాజు, జె.రామకృష్ణ, విళ్ల రామ్మోహన్‌కుమార్, గుమ్మడి నరేంద్ర, దాసరి శ్రీనివాసరావు, ఆర్కే నాయుడు, బి.కామేశ్వరరావు, వెంకయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీపీ బాగ్చీకి వేదపండితుల ఆశీర్వాదం



సీపీ బాగ్చీని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

**అగనంపూడి :** పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన ఉమామహేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఆశీర్వదించి జ్ఞాపిక అందజేశారు. ఈ ఆలయ కమిటీలో ఒకరిద్దరు ఆలయ అర్చకులకు జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధిస్తుండడంతో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు సీపీ బాగ్చికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ బాధితులకు ఫోన్‌చేసి అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తర్వాత దువ్వాడ సీఐ ద్వారా గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించారు. అర్చక కుటుంబానికి ఆలయం నుంచి రావల్సిన జీతం బకాయి ఇప్పించారు. దీనికి కృతజ్ఞతగా అర్చక కుటుంబీలు గురువారం సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి జ్ఞాపిక అందించడంతో పాటు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు పల్లంరాజు శర్మ, నాగేంద్రశర్మ, ప్రజా సంఘాల నాయకుడు పట్టా రామ అప్పారావు, నిమ్మకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూలో 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

**ఆరిలోవ:** ఇందిరా గాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, జూ అవుట్‌రీచ్, రీల్ మేకింగ్, బటర్‌ఫ్లై రన్నింగ్ వర్క్‌షాప్, సీడ్ బాల్ మేకింగ్, బర్డ్ వాక్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94408 10213ను సంప్రదించాలని సూచించారు.

## క్రీడా పోటీల్లో ఇస్లాంపేట విద్యార్థుల సత్తా



విజేతలతో ఉపాధ్యాయులు

**పెదగంట్యాడ :** ఈ నెల 23, 24 తేదీల్లో మండల స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచారు. 17 ఏళ్లలోపు బాలికల విభాగం ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. చదరంగంలో పదో తరగతి విద్యార్థిని ప్రత్యూష ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా నీతాకుమారి ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్ 17 ఏళ్ల బాలుర విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించగా, 14 ఏళ్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో 8వ తరగతి విద్యార్థి సూరజ్ కుమార్ ప్రథమ స్థానాన్ని సాధించాడు.

**నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు..**

ఈ నెల 25న నిర్వహించనున్న నియోజకవర్గ, ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఖోఖో 17 ఏళ్ల బాలుర విభాగంలో తొమ్మిదవ తరగతి విద్యార్థి సందీప్‌కుమార్, బాలికల విభాగంలో రబీనా బేగం ఎంపికయ్యారు. ఖోఖో 14 ఏళ్ల బాలుర విభాగంలో ఎనిమిదవ తరగతి విద్యార్థి సూరజ్ కుమార్, బాలికల విభాగంలో డి.సాయి, నౌసేనా కౌజర్ ఎంపికయ్యారు. వాలీబాల్ 17 ఏళ్ల బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థులు జశ్వంత్ కుమార్, ప్రవీణ్ కుమార్, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని లలితా బుద్రా, పదో తరగతి విద్యార్థి సీహెచ్ యామిని ఎంపికయ్యారు. చదరంగం 17 ఏళ్ల విభాగంలో పదో తరగతి విద్యార్థిని నీతాకుమారి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడా పోటీల విజేతలు, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జి.ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహమూర్తి అభినందించారు.

# మర్యాదపూర్వక కలయిక



అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి, వంశీరెడ్డి



జగన్‌కు గాజువాక లడ్డూ ప్రసాదం అందజేస్తున్న వంశీరెడ్డి, గణేష్ తదితరులు

**గాజువాక :** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాగిరెడ్డితో పాటు ఆయన కుమారులు వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జగన్‌ను కలిశారు. రానున్న ఐదేళ్లు ప్రజలకు తోడుగా ఉండాలని, కార్యకర్తలను కాపాడుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి తమకు సూచించినట్టు నాయకులు తెలిపారు.

**జగన్‌కు వినాయక లడ్డూ ప్రసాదం అందజేత..**

ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహిస్తున్న 89 అడుగుల ఉచ్ఛిష్ట గణపతి ఉత్సవ నిర్వాహకులు స్వామివారి 20 కేజీల లడ్డూ ప్రసాదాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అధినేతను కలిసి ఈ ప్రసాదాన్ని అందజేశారు. ప్రతి ఏడాది తాము నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల ప్రసాదాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి అందజేయడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

### 30న దివ్య కళామేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

**పెదగంట్యాడ :** దివ్యాంగుల కోసం ఈ నెల 30న నిర్వహించనున్న దివ్య కళామేళా (జాబ్ మేళా)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమాధవి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి కోరారు. ఈ మేరకు దివ్య కళామేళా పోస్టర్‌ను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్చర్ ఫౌండేషన్ అండ్ రైజ్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ మండలంలోని గొడ్డువానిపాలెంలో గల సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. 18 ఏళ్ల నిండి 35 దాటని దివ్యాంగులు ఈ మేళాకు హాజరు కావాలన్నారు. కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు.

## డ్వామా పీడీ పూర్ణిమాదేవి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

**మహారాణిపేట:** జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీడీగా ఉన్న ఈ.సందీప్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పూర్ణిమాదేవిని డ్వామా పీడీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## హోంగార్డుకు చెక్కు అందజేత



జగన్నాథరావుకు చెక్కు అందజేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

**అల్లిపురం:** హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పీల జగన్నాథరావు గత నెల 15వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గురువారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తన కార్యాలయంలో అతనికి హోంగార్డుల ఒకరోజు వేతనం రూ.6,94,380 అందజేశారు.

# దంచికొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగి పొర్లిన గెడ్డలు
- చెరువులను తలపించిన రోడ్లు



గాంధీనగర్‌లో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం



వుడా కాలనీ ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వర్షం నీరు



చెరువును తలపిస్తున్న నెల్లిముక్కు ప్రధాన రహదారి

**పెదగంట్యాడ :** గురువారం కురిసిన వర్షానికి జీనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రహదారులన్నీ చెరువులను తలపించాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. పెదగంట్యాడలో పలు ఖాళీ స్థలాలు వర్షం నీటితో నిండిపోయి చెరువుల్లా మారిపోయాయి. పెదగంట్యాడ రైతుబజార్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోయారు. కాలువలు, ప్రధాన గెడ్డలు పొంగిపొర్లాయి.

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**పెదగంట్యాడ :** విద్యార్థులు ఆధునిక సౌకర్యాలను వినియోగించుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. రూ.34 లక్షల కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ న్యూ ఐటీఐలో ఆధునికీకరించిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కోరమాండల్ సీఎస్సార్ నిధులతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. అలాగే 25 కంప్యూటర్లు, మూడు ఏసీలు, ఐదు ఫ్యాన్లు, ఒక యూపీఎస్‌ను అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 80 మంది విద్యార్థులకు ఉలెన్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్, ప్లాంట్ హెడ్ ఎం.జ్ఞాన సుందరం, సీఎస్సార్ హెడ్ జయగోపాల్, హెచ్‌ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఏకే బాలాజీ, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.